www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 15 ఏప్రిల్ 2024 | 8 పేజీలు

ఏలూరు | పశ్చిమ గోదావరి





బిల్లుల బాదుడు..!

విద్యుత్ బిల్లుల మోత ఏ మాత్రమూ ఆగలేదు. ఎన్నికల వేళ సైతం బిల్లుల బాదుడు చూసి జనం హడలిపోతున్నారు. ఏప్రిల్ మొదటివారంలో వచ్చిన మార్చినెల విద్యుత్ బిల్లు చూసి జనం గగ్గోలు పెడుతున్నారు. వేసవి కావడంతో కరెంటు వాడకం పెరగడం, అందుకు అదనంగా అదనపు ఛార్జీల భారం తోడవడంతో సామాన్య ప్రజానీకం విద్యుత్ బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్న పరిస్థితి నెలకొంది.

అదనపు ఛార్జీలతో విద్యుత్ బిల్లుల మోత

మార్చి బిల్లులు చూసి జనం గగ్గోలు

రెండేళ్లుగా బాదుడే.. బాదుడు

సామాన్యులపై నెలకు రూ.300పైనే అదనపు భారం

విద్యుత్ ఛార్జీలపై ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 12 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 80 శాతం సామాన్య ప్రజానీకానివే. గడిచిన రెండేళ్లుగా వైసిపి ప్రభుత్వం అదనపు ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తోంది. ఇష్టానుసారంగా కష్టమర్‌ఛార్జ్, ఫిక్స్‌డ్ ఛార్జ్, ఈడి, ఎఫ్‌పిపిసిఎ-1, 2 ఇలా ఐదారు రకాల పేరుతో అదనపు ఛార్జీలు బాదేస్తోంది. దీంతో ప్రతినెలా కరెంటు బిల్లులు కట్టలేక జనం అల్లాడిపోతున్న పరిస్థితి నెలకొంది. వాడుకున్న కరెంటుకు బిల్లు రూ.400 వస్తే అదనపు ఛార్జీల భారం రూ.250 వరకూ ఉంటుంది. దీంతో కరెంట్ స్విచ్ వేయాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో సొమ్ములు ఇస్తున్నట్లు ప్రచారం చేస్తోంది. ఇష్టానుసారంగా పెంచిన కరెంటు ఛార్జీల గురించి మాత్రం మాట్లాడటం లేదు. వేసవి కావడంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కరెంటు వాడకం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఈ రెండు నెలలు బిల్లుల పరిస్థితి ఏంటోనన్న ఆందోళన అందరినీ వెంటాడుతోంది. సామాన్య కుటుంబాలు సైతం ప్రతినెలా రూ.200 నుంచి రూ.300 వరకూ అదనంగా విద్యుత్ బిల్లులు కట్టాల్సి వస్తోంది. ఏడాదికి రూ.నాలుగు వేల వరకూ అదనంగా కరెంటు బిల్లుల రూపంలో



రూ.479 వచ్చిన బిల్లుకు అదనపు ఛార్జీలు రూ.222 వేసిన విద్యుత్ బిల్లు

ప్రభుత్వం సామాన్య ప్రజానీకం నుంచి సైతం పిండేస్తోంది. ఏలూరులో ఒక కుటుంబానికి మార్చి నెలలో వాడుకున్న విద్యుత్‌కు రూ.479 బిల్లు అయ్యింది. కానీ ఫిక్స్‌డ్ ఛార్జీల కింద రూ.20, కష్టమర్ ఛార్జీ కింద రూ.50, ఈడి ఛార్జీ రూ.8.16, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల కింద రూ.147 కలిపి మొత్తం రూ.701 బిల్లు వేసిన పరిస్థితి నెలకొంది. వాడుకున్న కరెంటుకు కాకుండా అదనంగా రూ.222 బిల్లులో వచ్చింది. ఈ పరిస్థితి ఎన్నాళ్లు అంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. విద్యుత్ ఛార్జీలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఎన్నికల వేళ హాట్‌టాపిక్‌గా మారింది.

ఎన్నికల వేళ విద్యుత్ ఛార్జీలపై చర్చ

ప్రస్తుతం ఎన్నికల కోలాహలం నడుస్తోంది. దీంతో జనాల్లో విద్యుత్ ఛార్జీలపై ప్రధానంగా చర్చ కొనసాగుతోంది. ఊహించని విధంగా కరెంటు ఛార్జీల పెంపుపై జనంలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షాలు సైతం ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచేసిందంటూ ప్రచారం చేయడం తప్ప తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలపై ఏంచేస్తారో చెప్పడంలేదు. విద్యుత్ ఛార్జీల పెంపు, అదనపు ఛార్జీల భారం ఉండదంటూ రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో పెట్టాలన్న డిమాండ్ జనాల నుంచి వినిపిస్తోంది. పట్టణాల్లో అయితే చెత్త, ఆస్తి పన్ను ..6లో



సిఎం రాత్రి బస చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి

సిఎం పర్యటనలో మార్పు

16వ తేదీకి సభ వాయిదా

ప్రజాశక్తి - ఉంగుటూరు

సిఎం జగన్ జిల్లా పర్యటనలో మార్పులు చోటు చేసుకున్నాయి. ముందు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కృష్ణా జిల్లా నుంచి భీమవరం రోడ్ షోగా విచ్చేసి సోమవరం సాయంత్రం భహిరంగ సభ జరగాల్సి ఉంది. సిఎం తలకు గాయం కావడంతో జిల్లాలో సిఎం పర్యటన ఈనెల 16వ తేదీ మంగళవారానికి వాయిదా పడింది. సిఎం పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. కృష్ణాజిల్లా గుడివాడలో సోమవారం సాయంత్రం భహిరంగ సభ ముగిసిన అనంతరం ఆయన హనుమాన్ జంక్షన్ మీదుగా రోడ్ షోగా ఏలూరు, దెందులూరు మీదుగా నారాయణ పురం చేరుకోనున్నారు. అక్కడే బస చేసి మంగళవారం రోడ్ షోగా భహిరంగ సభలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి బస చేసే ప్రాంతంతోపాటు పరిసరాలను పోలీసు శాఖ స్వాధీనం చేసుకుంది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదివారం నారాయణపురం వచ్చి పరిశీలించారు. పోలీసు అధికారులకు పలు ఆదేశాలిచ్చారు. ఆమె వెంట డిఎస్‌పి శ్రీనివాసులు, నిడమర్రు, గణపవరం సిఐలు సుభాష్, రవికుమార్ ఉన్నారు.

అంబేద్కర్ గొప్ప దార్శనికుడు

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు



అంబేద్కర్ చిత్రటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

భారత రాజ్యాంగ నిర్మాణంలో డాక్టర్ అంబేద్కర్ పాత్ర మరువరానిదని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ దేశభక్తి, మానవతా విలువలు కలిగిన అంబేద్కర్ గొప్ప దార్శనికుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు ఆదర్శనీయమన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విద్యావంతులై అభివృద్ధి చెందాలన్నారు. జెసి లావణ్య వేణి మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో సామాజిక న్యాయాన్ని పొందుపర్చారన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. వారి స్ఫూర్తితో విద్యార్థులంతా గొప్ప చదువులు ..6లో

నేటి నుంచి జూన్ 15 వరకూ

సముద్రంలో వేట నిషేధం

ప్రజాశక్తి - నరసాపురం



సముద్రంలో చేపల వేట నిషేధం ఈనెల 15వ తేదీ సోమవారం నుండి అమలు కానుంది. ఇది జూన్ 15వ తేదీ వరకూ 61 రోజుల అమలు కానుంది. ఆయా సమయాల్లో వేట సాగిస్తే మత్స్య సంపద దెబ్బతింటుందనే ఉదేశంతో ఏటా ప్రభు త్వం వేట విరామం ప్రకటిస్తోంది. ఆ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం రూ.10 వేలు భృతి అందిస్తోంది. పరిహారం చెల్లింపునకు అర్హులైన వారిని గుర్తించాలని మత్స్య శాఖ ఆదేశించింది. జిల్లాలో మొత్తం 19 కిలోమీటర్లు సముద్రతీరం ఉంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రభుత్వం వేట విరామం ప్రకటించింది. వేట నిషేధ సమయంలో చేపల పునరుత్పత్తి ఉంటుందని, వాటి సంతతి పెరుగుదల ప్రోత్సహించడం ద్వారా వచ్చే సంపద మరింత పెంపొందుతుందని, ఈ క్రమంలో నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా బోట్ల యజమానులకు సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ 1994 చట్టాన్ని అనుసరించి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకుంటామని, జరిమానా విధించి, డీజిల్ రాయితీ, ఇతర సౌకర్యాలు నిలిపివేస్తామని ..6లో

భిన్న సంస్కృతుల ద్వీపం నరసాపురం

మధ్యపేజీల్లో..

పగలు ప్రచారాలు.. రాత్రి మంతనాలను

మధ్యపేజీల్లో

కట్టుదిట్టంగా ఇవిఎంల తరలింపు

8లో..

'జగన్‌పై దాడి హేయమైన చర్య'



కుక్కునూరు : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఎంఎల్ఎ బాలరాజు, నేతలు

7లో..

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని వివిధ ప్రాంతాలలో ఆదివారం అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలులో నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవడం పెద్ద సవాలుగా ఏర్పడిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, సిపిఎం అనుబంధ శాఖల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇదేవిధంగా పొలసానిపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, మాజీ ఉప సర్పంచి ఎ.నాగేంద్రప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి జయ రామకృష్ణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా వైసిపి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. జంగారెడ్డిగూడెం సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన అంబేద్కర్ 133వ జయంతి వేడుక జరిగింది. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి ఎ.రవి, పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ భారతదేశంలో దళితులు, పేదలు, మహిళలు, ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించడం కోసం భారత రాజ్యాంగాన్ని రచించిన వ్యక్తి మేధావి బిఆర్.అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బొడ్డు రాంబాబు, అందుగుల ప్రభాకర్ రావు, జి.సూర్యకిరణ్ పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రజలంతా మొదట విద్యావంతులు కావాలి, అప్పుడే ఒక ఉన్నతమైన సమాజం ఏర్పడుతుందని చెప్పిన మహోన్నతుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని విద్యుత్‌శాఖ డిఇ అంబేద్కర్ అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలోని దేశవరం గ్రామమంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించారు. సర్పంచి భూపతి, ఎంపిటిసి కాందికొండ నాగలక్ష్మి, ఎఐఎం నాయకులు కాకర్ల సత్యం, ఎన్ఎస్.రాజేంద్ర, దాసు, వైస్ సర్పంచి పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల రూరల్ : మండలంలోని కోడిగూడెం గ్రామంలో అంబేద్కర్ సొసైటీ అధ్యక్షులు మానుకొండ ఇమ్మానియేలు, మానుకొండ వెంకటరత్నం ఆధ్వర్యంలో ప్రపంచ మేథావి న్యాయ శాస్త్ర కోవిదుడు రాజ్యంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత బహుజన నాయకులు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు బాతుల వేణు విచ్చేశారు. మానుకొండ రవి, మానుకొండ ప్రవీణ్, బిరుదుగడ్డ పండు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అన్నారు. ఆదివారం ఉదయం అంబేద్కర్ జయంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిల్లి రామకృష్ణ,



జంగారెడ్డిగూడెం టౌన్: అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రవి

ఎం.సత్యనారాయణ, ఎం.ఇషాక్, జె.గోపి, జాన్, జి.కోటేశ్వరరావు, ఎల్.సత్యనారాయణ, మీసాల సత్యం, సింహాచలం పాల్గొన్నారు.

నిడమర్రు: అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని నిడమర్రులో సిపిఎం నాయకులు కోన శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పొట్నూరు ఉమామహేశ్వరరావు, సిపిఎం నాయకులు కవర్ సత్యనారాయణ, లావేటి చంద్రరావు, మోహన్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా మండలంలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురం, ధర్భగూడెం, జీలుగుమిల్లి, పుచికపాడు, ములగలంపల్లి, కామయ్యపాలెం గ్రామాల్లోని అంబేద్కర్ యూత్ సభ్యులు దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ యూత్ సభ్యులు మధు, సతీష్, కృష్ణ, ప్రకాశం, కన్నయ్య, దేవ పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఉంగుటూరు తహశీల్దారు కార్యాలయం వద్ద ఆదివారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఉంగుటూరు రిటర్నింగు అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎస్ఎస్‌కె.ఖాజావలీ అంబేద్కర్ చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన కృషి సేవలపై మాట్లాడారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను ఆగిరిపల్లిలో ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పలువురు విద్యావేత్తలు, నాయకులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించగా, ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా హైస్కూల్ కూడలి వద్ద వున్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా అధ్యక్షులు ఎంఎల్ఎ ఆళ్లనాని క్యాంప్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాస్, మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు డిప్యూటీ మేయర్ నుకపెయ్యి సుధీర్ బాబు, ఏలూరు కోప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, ఏలూరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పొలిమేర దాస్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామాల్లో యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లిలో గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, విగ్రహ కమిటీ సభ్యులు నివాళులర్పించారు. మాల మహానాడు ఆధ్వర్యంలో సేవ నాగ జగన్ బాబురావు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు ముదినేపల్లితో పాటు పలు గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

కలిదిండి : మండలంలో వాడవాడలా అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లోని సిఐటియు, ప్రజాసంఘాల కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళి రావు, నాయకులు కె.లాజరు, వి.భాస్కరరావు, పరసా రాజేష్, ముంగం సురేష్, జక్కుల మహేష్, జోజిబాబు, పి.సత్యన్నారాయణ, అద్దాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పట్టణంలో సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆదివారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమాన్లు, సిపిఎం నాయకులు దుర్గారావు, మరియదాసు, వసంతరావు, శోభనాద్రి మనోహర్ పాల్గొన్నారు. నూజివీడు పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో ఎన్‌డిఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

ముసునూరు : అంబేద్కర్ జయంతి సందర్భంగా మండలంలోని 16 గ్రామాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాధన ఎస్‌సి, ఎస్‌టి, వెనుకబడిన వర్గాల సంస్థ నాయకుల ఆధ్వర్యంలో సూరేపల్లి మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో కంకట హాని, కంకటరాజు, ఎఎస్ఐ అశోక్‌ల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నూజివీడులోని ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆయన కార్యాలయంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

కుక్కునూరు: మండలంలోని రామచంద్రాపురం విలేజ్‌లో గ్రామస్తులు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సేవలను కొనియాడారు.

చాట్రాయి: అంబేద్కర్ జయంతిని ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. జనార్థన వరం గ్రామంలో జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో, చిన్నంపేట గ్రామంలో అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

టి.నరసాపురం: అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ సామాజిక వేత్త, వైసిపి యువ నాయకులు పెండ్యాల అభిషేక్ బాబు తెలిపారు. మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.


ముదినేపల్లి: మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

పట్టణంలో స్థానిక భగత్ సింగ్ సెంటర్‌లో కీర్తిశేషులు చెరుకూరి సుందరం జ్ఞాపకార్థంగా చలివేంద్రాన్ని ఆయన కుమారుడు చెరుకూరి శ్రీధర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్, టిడిపి కార్యకర్తలు చెరుకూరి సుందరం, అభిమానులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలోని గురజలో వైసిపి నాయకులు బొర్రా శేషుబాబు, పుట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. తొలిరోజు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఈడే వెంకటేశ్వరమ్మ, గంటా సంధ్య, మోట్రూ యేసుబాబు, మరీదు వసంతరావు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామసభను విజయవంతం చేయాలి

భీమడోలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా నిర్వహిస్తున్న చట్టబద్ధ గ్రామసభను విజయవంతం చేయాలని భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ కోరారు. భీమడోలు పంచాయతీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని చట్టబద్ధ గ్రామసభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచి పి.సునిత మాన్సింగ్ అధ్యక్షత వహించారు. అనంతరం గ్రామసభను గ్రామపంచాయతీ కార్యదర్శి కొనసాగించారు. దీనిలో భాగంగా ఏవిధమైన తీర్మానాలను చేయలేదు. ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసే అంశాలు చర్చకు రాలేదు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి స్వీప్ కార్యక్రమ ప్రాధాన్యత గురించి వివరించారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లు పూర్తిస్థాయిలో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కళాజాత కార్యక్రమాలు ఇప్పటికే భీమడోలులో పూరైన నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభ సందర్భంగా వాటిని ఏర్పాటు చేయలేదని తెలిపారు.

టిడిపి తీర్థం పుచ్చుకున్న శ్రీనివాసరావు



ప్రజాశక్తి- ముదినేపల్లి

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నేత, మహాసేన జిల్లా అధ్యక్షులు దాకరపు శ్రీనివాసరావు ఆదివారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వినోద్ పార్టీ కండువా కప్పి సాదరంగా శ్రీనివాసరావును పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెక్కపై వైఎస్ఆర్ చిత్రం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ఉన్న అభిమానంతో ఆయన చిత్రం చెక్కపై చెక్కి తన అభిమానాన్ని చాటుకున్నాడో అభిమాని. కొయ్యలగూడెంకి చెందిన నూకల రాము చిత్రం చెక్కడానికి 2 నెలలు పట్టింది, రూ.60 వేలు ఖర్చు అయ్యిందని తెలిపారు. సిఎం జగన్‌కి, ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా అందిస్తామని తెలిపారు.

ముఖ్య వార్తలు
సోమవారం 15 ఏప్రిల్ 2024

ఉపాధి కరువై.. బతుకు భారమై..!

పనుల్లేక వలసలు వెళ్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి లేక.. బతుకు భారమై ఆ గ్రామంలో పలువురు వలసబాట పడుతున్నారు. మండల కేంద్రానికి శివారున 12 కిలోమీటర్ల దూరాన ఉన్న ఆ గ్రామమే చైతన్యపురం. గతంలో వరిసాగు ఉంటే పనులుండేవి. పనులకు కొదవ లేదు. నేడు ఆ గ్రామాన్ని చేపల చెరువులు కమ్మేశాయి. అరకొర పనులతో కాలం వెళ్ల దీస్తున్నారు. వారికి ఉపాధి చూపడంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం విఫలమైంది. నాలుగైదేళ్ళుగా ఉపాధి కార్డులు లేకపోవడంతో ఆ పనులు కరువయ్యాయి. పనులకు బైటకు వెళ్లామంటే,


ముళ్లకంపలు అడ్డం పెట్టుకుని వలసలకు..

రోడ్డున బస్సులు రావు. కనీసం ఆటో సౌకర్యం లేదు. గ్రామంలో రక్షిత మంచినీటి సరఫరా పథకం ఉన్నా నిరుపయోగమే. మంచినీటికి కొరుకొల్లు వెళ్లి రావాలంటే 10 కిలోమీటర్ల ప్రయాణం చేయాలి. లేకుంటే ముదినేపల్లి మండలం వైవాక వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థుల విద్యకు ఆటంకాలే. ప్రాథమిక విద్య ఐదవ తరగతి పూర్తయితే, రవాణా సౌకర్యం లేకపోవడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితిలో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారు. గతంలో సుమారు 200 కుటుంబాలు ఆ గ్రామంలో ఉండేవి. నేడు కనీసం 100 కుటుంబాలు కానరావు. చేపల చెరువులపై కాపలాదారులుగా కొన్ని


నిరుపయోగంగా ఉన్న మంచినీటి ట్యాంక్

కుటుంబాలు వెళితే, మరికొందరు హైదరాబాదు వంటి నగరాలకు వలస వెళ్లారు. ఇళ్ల ముందు ముళ్లకంప వేసి వలస పోయారంటే వారి పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఆ గ్రామంలో కొన్ని ఇళ్లల్లో వృద్ధులే ఉన్నారు. వలసలు నివారించడానికి ఉపాధి కల్పించి, కనీస వసతులు కల్పించడంపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి పనులు చూపించాలి

వరపాల వీరబాబు, గ్రామస్తుడు



ఉపాధి పనులు లేవు. గతంలో ఎప్పుడో ఉపాధి కార్డులు ఇచ్చారు. ఇప్పుడు కార్డులు లేవు. పనులు లేవు, కొరుకొల్లు చుట్టుపక్కల గ్రామాల వాళ్ళు మా గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్నారు.

తాగునీటికి 10 కిలోమీటర్లు వెళ్లాలి

ఎస్.పెద్దింట్లమ్మ



రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా వచ్చే నీరు తాగడానికి పనికిరావు. చెరువులోని నీరు పైకి ఎక్కిస్తారు. అవే కిందికి వదులుతారు. 20 లీటర్ల నీటి కోసం 10 కిలోమీటర్లు వెళ్లి రావాలంటే రూ.80కు పైగానే ఖర్చు అవుతుంది.

తాగునీటికి అల్లాడుతున్నాం..

ఎస్.సత్యవతి, పింఛనుదారురాలు



పింఛనే ఆధారం. మంచినీటికి అల్లాడిపోతున్నాం. తాగునీరు కూడా కొనాలి అంటే ఎలా బతకాలి ఇంక, ఇక్కడి నుంచి బయటకు వెళ్లాలంటే నరకం చూస్తున్నాం. ఈనెల పింఛను కోసం కొందరు కొరుకొల్లు వెళ్లివచ్చారు. తరువాత ఈ ఊరిలోనే పింఛను ఇస్తామని అధికారులు చెప్పి వచ్చి ఇచ్చారు.

ఆసుపత్రికి వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేదు

ఎలగాలేటి సమాధానం



8 నెలల క్రితం వెన్నులో లింకు జరిగిపోయిందని డాక్టర్లు చెప్పారు. ప్రతిరోజూ బిళ్లలు వాడాలి. బయటకు వెళ్లాలంటే బస్సు లేదు. కనీసం ఆటోలు కూడా రావు. ప్రభుత్వం సమస్యలపై చొరవ చూపాలి.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం నర్సాపురం-పాలకొల్లు జాతీయ రహదారిపై ట్రక్ ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో నరసాపురం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న మురపాక సంతోష్ కుమార్(37) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన నర్సాపురం శ్రీహరి పేట నివాసి. నర్సాపురం నుంచి జగన్నాథపురం పెళ్లి కార్డులు పంచుటకు వెళుతున్నట్లు సమాచారం. మృతుని భార్య మురపాక సన్యాసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకొల్లు రూరల్ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం గ్రామంలో పుట్ట రాటాలు(56) ట్రాక్టర్ డ్రైవర్ ఈనెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జున రెడ్డి ఆదివారం తెలిపారు. గ్రామంలో ఒక రైతు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని అతని భార్య రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో పలువురికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని బర్రింకల పాడు సమీపంలో రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొయ్యలగూడెం మండలంలోని కంట్రికగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై జీలుగుమిల్లి వైపుకి వస్తు ఎదురుగా వస్తున్న ద్వి చక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాల మీదవున్న పలువురు గాయలపాలయ్యారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఓటమి భయంతోనే జగన్ డ్రామా

టిడిపి అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్ర సభలకు ప్రజలు రాకపోవడంతో ఓటమి భయంతో మరో కోడికత్తి డ్రామాలా.. రాయి దాడితో ప్రజల సానుభూతిని పొందాలనుకోవడం సిగ్గుచేటని పశ్చిమగోదావరి జిల్లా టిడిపి అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. జగన్ రాయిదాడిపై ఆమె ఆదివారం స్పందించి మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ పర్యటనలో కరెంటు ఎందుకు నిలిపివేశారని, దాడి జరిగిన 4 నిమిషాలలోనే క్యాట్ బాలుతో జగన్ కంటిబొమ్మపైన కొట్టారని నిర్ధారించిన పోలీసులు దాడి చేసిన వారిని ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. దాడి జరిగిన కొన్ని సెకన్లలోనే భూలుగు మీడియా, సోషల్ మీడియాలలో ఇది టిడిపి పనేనని విస్తృత ప్రచారం చేసి ఎన్నికలలో లబ్ధి పొందాలనుకోవడం పిరికిపంద చర్య అన్నారు. జగన్ అబద్ధపు ప్రచారాలు, అసత్యాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, జగన్ ప్యాలెస్ నాటకాలకు ప్రజలంతా ఈవిఎం బటన్ ద్వారా తీర్పు ఇచ్చి వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

వైసిపిలోకి పలువురు

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలో భారీగా వైసిపిలోకి చేరారు. వైసిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి శ్రీరంగనాథరాజు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

భీమవరం రూరల్: భీమవరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన టిడిపి, జనసేన శ్రేణులు స్థానిక క్యాంపు కార్యాలయంలో వైసిపిలోకి చేరారు.

అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

మానస స్కూల్ కరస్పాండెంట్ రవీంద్ర కుమార్

ప్రజాశక్తి - భీమడోలు

అగ్ని ప్రమాదాలతో నష్టపోవటం కన్నా వాటి నివారణకు తీసుకొనే ముందస్తు రక్షణ చర్యలు సత్ఫలితాలను ఇస్తాయని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ అన్నారు. భీమడోలు ఫైర్ ఆఫీసర్ జి.నాగరాజు ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు అగ్నిమాపక కేంద్రం వద్ద ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న యలమర్తి రవీంద్ర కుమార్ తొలుత అగ్ని ప్రమాద అమరవీరులకు నివాళులను సమర్పించారు. వారి సంస్మరణార్థం రెండు నిమిషాల పాటు సభికులతో కలిసి మౌనం పాటించారు. ఆ తర్వాత అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సత్కరించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి జి.నాగరాజు తమ శాఖ అందిస్తున్న సేవలు, దానికోసం వినియోగించే పరికరాల గురించి ముఖ్యఅతిథికి తెలియజేశారు. విద్యార్థులు, ప్రముఖులు భాగస్వామ్యంతో అగ్నిమాపక వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు నివారణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ మేరకు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్న అగ్నిమాపక కేంద్రం సేవలను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఫైర్ ఆఫీసర్ జి.నాగరాజు మాట్లాడుతూ తమ కార్యాలయ పరిధిలో గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత సంవత్సరం అగ్నిప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. ఇతర అంశాల గురించి వివరించారు.

సరిహద్దుల్లో నిఘా పెట్టాలి

అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ కె.విజయ

చింతలపూడి: సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబడిన చెక్‌పోస్టులు, సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అక్రమ మద్యం, నాటుసారా అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టాలని అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ కె.విజయ ఆదేశించారు. పట్టణంలో కె.విజయ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో కమిషనర్ మంగళగిరి, చింతలపూడి ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తీసుకుంటున్న చర్యలు గురించి సమీక్షించి, ఎలక్షన్ కమిషనర్ నియమ నిబంధనలు అనుసరించి విధులు నిర్వహించాలన్నారు. చింతలపూడి స్టేషన్ పరిధిలో ఎలక్షన్ దృష్ట్యా ఏర్పాటు చేయబడిన చెక్‌పోస్టుల్లో నమోదు చేసిన కేసుల గురించి సమీక్షించారు. ఈ తనిఖీలో చింతలపూడి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ డిఎస్ఎస్‌వి.ప్రసాద్, ఎస్ఐ పి.లక్ష్మణరావు ఉన్నారు.

స్నేహితునికి ఆర్థిక సాయం

మొగల్తూరు: చదువులోనే కాదు కష్టాల్లోనూ తోడుంటామని పూర్వ విద్యార్థులు తమ స్నేహభావాన్ని చాటుకున్నారు. మండలంలోని శేరెపాలెం గ్రామానికి చెందిన మామిడిశెట్టి ఏడుకొండలుకు పూర్వ విద్యార్థులు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1987-88 లో పదవతరగతి విద్యను అభ్యసించారు. మిత్రుడు ఏడుకొండలు ఇటీవల అనారోగ్యానికి గురై తన కాలుని తీసివేశారు. ఏడుకొండలును ఆర్థికంగా ఆదుకునేందుకు మిత్రులు గుత్తుల వరప్రసాద్, పాము శ్రీనివాస్, తిరుమాని పూర్ణచంద్ర రాజు, పితాని చంద్రశేఖర్, వెలిగట్ల శ్రీనివాస్, కపుర సత్యనారాయణ, వాటాల సూర్య ప్రకాష్, శీలబోయిన సత్యనారాయణ, కుక్కల శ్రీనివాస్, పెద్దిరాజు, డాక్టర్ సుజనలు సమకూర్చిన ఆర్థిక సహాయాన్ని ఏడుకొండలుకు అందించారు.

ముస్లిం యువతి పెళ్లికి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం అని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తూము విజయకుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలోని గణేష్ కాలనీ-2లో నివసిస్తున్న పేద ముస్లిం యువతి 'షేక్ మైమూనా' వివాహ సందర్భంగా వారి కుటుంబానికి జనసేన ఆధ్వర్యంలో రూ.8,500లు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు బాటలో నడుస్తున్నామని, ఆయనకు ఉన్నదానిలో ప్రజలకు పంచుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తూము విజయ్ కుమార్, పొన్నమనేని దుర్గాభవాని, గుమ్మిసెట్టి భారతి, నాగేశ్వరరావు, కురిసెట్టి సీతారామయ్య, దత్తి సూర్య నాగరాజు, నల్లా దుర్గారావు, గుళ్లపూడి సత్యనారాయణ, షేక్ రజాక్, షేక్ పాషి, షేక్ షర్మిల, షేక్ అలీ పాల్గొన్నారు.

సంగాలమ్మ ఆశీస్సులు అందరిపైనా ఉండాలి

ఎంఎల్ఎ రామరాజు, జుత్తిగ నాగరాజు

ఉండి: కలిగొట్ల గ్రామ దేవత సంగాలమ్మ అమ్మవారి ఆశీస్సులు అందరిపైనా మెండుగా ఉండాలని అమ్మవారిని కోరినట్లు ఎంఎల్ఎ రామరాజు, జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. సంగాలమ్మ అమ్మవారి 55వ జాతర మహోత్సవం సందర్భంగా ఆదివారం ఆ గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో దాతల సహకారంతో అఖండ అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్ఎ రామరాజు, జుత్తిగ నాగరాజు ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కలిగొట్ల గ్రామ దేవత సంగాలమ్మ అమ్మవారు భక్తుల పాలిట కల్పవల్లి అని అన్నారు. అమ్మవారి జాతర మహోత్సవాన్ని కులమతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా కలిగొట్ల గ్రామ ప్రజలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అమ్మవారి జాతర మహోత్సవం అనంతరం నిర్వహించిన అఖండ అన్నసమారాధన కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆలయ కమిటీ వారు తెలిపారు.

పగలు ప్రచారాలు .. రాత్రి మంతనాలు



ప్రజాశక్తి - కాళ్ల

సార్వత్రిక ఎన్నికల వేడి తారాస్థాయికి చేరుతోంది. పార్టీల అభ్యర్థులు ప్రచారాల్లో మునిగిపోయారు. సుర్రున మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో వైసిపి, కాంగ్రెస్, స్వతంత్ర అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాల్లో నిమఘ్నమయ్యారు. వైసిపి తరపున పివిఎల్.నరసింహరాజు, కాంగ్రెస్ తరపున వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, స్వతంత్ర అభ్యర్థి, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజులు పోటీలో ఉన్నారు.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రచారం చేస్తూ ఓటర్లను స్వయంగా కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వైసిపి నుంచి పివిఎల్. నరసింహరాజు మరోసారి పోటీ చేస్తున్నారు. పివిఎల్.నరసింహరాజుతో పాటు ఆయన సోదరుడు గోపాలకృష్ణంరాజు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల పాటు వారు ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. కాంగ్రెస్ తరపున ఎన్నికల బరిలో నిలిచిన వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకటశివరామరాజు కూడా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఉండి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలను కలిసి వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చాటుదాం అనేలా అందరినీ కలిసి ముందుకెళ్తున్నారు. నామినేషన్ల దాఖల తరువాత ఈ ప్రచారాలు మరి ఇంత ఉధృత మయ్యే అవకాశం ఉంది. నామినేషన్ దాఖలు చేయడానికి మునుపే ఓ విడత ప్రచారాలు ముగించేయాలన్న భావనతో తిరుగుతున్నారు.

అసమ్మతి సెగలు

ఉండి నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు అసమ్మతి సెగ చుట్టుకుంది. దీంతో అభ్యర్థులు వారిని మచ్చిక చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు. టిడిపి, వైసిపి, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థి ఎన్నికల బరిలో ఉన్నారు. టిడిపిలో అభ్యర్థి ప్రకటన తర్వాత అసమ్మతి రాగాలు వినిపిస్తున్నాయి. ఇందులో కొన్ని బహిర్గతం అవుతుండగా మరికొన్ని లోలోపలే జరుగుతున్నాయి.

ఉదయం ప్రచారాలు

ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో భాగంగా అభ్యర్థులు ముమ్మర ప్రచారాలు చేస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల కల్లా ప్రచారంలోకి దిగుతున్నారు. ఆయా ప్రాంతాల నేతలను వెంటబెట్టుకని అభ్యర్థులు ఓటర్లను కలుస్తున్నారు. ప్రతి ఒక్కరినీ వ్యక్తిగతంగా కలిసి ఓట్లు అడుగతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో సభలను నిర్వహించి వారి పార్టీ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు.

అంతర్గత సమావేశాలు.. బుజ్జగింపులు

ప్రచారంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో అసమ్మతి నేతలను కలిసేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. అధికారం వస్తే న్యాయం చేస్తామంటూ వారికి హామీనిచ్చి దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయి నేతలను రాష్ట్ర నాయకులు పిలిచి మాట్లాడుతున్నారు. అలక వహించిన నేతల కోరికలన్నింటినీ తీరుస్తామనేలా అభ్యర్థులు హామీలు గుప్పిస్తున్నారు. అందరినీ సమన్వయం చేస్తూ గెలవాలనే భావనలో నాయకులు ఉన్నారు. అయితే కొన్ని చోట్ల అసమ్మతి నాయకులు దారికొస్తుండగా, మరికొన్ని చోట్ల సహకరించేది లేదంటూ తెగేసి చెబుతున్నారు. ఇలాంటి చోట అభ్యర్థులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ గ్రామం లేదా వార్డులో ప్రత్యర్థి పార్టీలో బలమైన నేతను తమ వైపునకు తిప్పుకునేలా పావులు కదుపుతున్నారు. ఇలా ఉదయం ప్రచారం రాత్రి బుజ్జగింపులతో ప్రచారాలు జరుగుతున్నాయి. నామినేషన్లు వేసేలోగా అసంతృప్తులను దారికి తెచ్చుకోవాలనేలా అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు.


కుల సంఘాలతో మంతనాలు

ఉదయమే గ్రామాలకు వెళ్లి ఓట్లను అభ్యర్థించిన పార్టీల నేతలు సాయంత్రం వేళల్లో కుల సంఘాలతో మంతనాలు జరుపుతున్నారు. ఉదయం నుంచే నేతలు గ్రామాలకు చేరుకుని ప్రచారం చేస్తున్నారు. ప్రజలను నేరుగా కలుసుకుని ఓట్లను అభ్యర్థిస్తున్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులు గడపగడపకూ వెళ్లి ఓటు వేసి ఆశీర్వదించాలంటూ అభ్యర్థిస్తున్నారు. ఇక తాయిలాలతో ప్రసన్నం చేసుకునే వ్యూహాలకు పదును పెట్టారు. ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి తమ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తున్నాయి. ఓటరు జాబితా ఆధారంగా సామాజిక తరగతుల వారీగా ఎంత మంది ఉన్నారో లెక్కగడుతున్నారు. ఆ తరగతికి పెద్దమనిషి ఏవరో తెలుసుకుని అతని వద్దకు వెళ్తున్నారు. వీరి ఓట్లు ఇన్ని ఉన్నాయి, అవి తమ పార్టీకే వచ్చేందుకు విరీ సహాయ సహకారాలు అందించాలంటూ కోరుతున్నారు.

గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. తమ అనుచరుల్లోని ముఖ్యులను రంగంలోకి దింపి ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తున్నారు. ప్రధానంగా సామాజిక తరగతుల వారీగా ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు కుస్తీ పడుతున్నారు. కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను సామాజిక తరగతుల వారీగా గుర్తించి ఆకట్టుకునేందుకు బృందాలు ఏర్పాటు చేశారు. పగలు ప్రచారం.. రాత్రి మంతనాలు సాగిస్తూ అభ్యర్థులతో పాటు వారి అనుచరులు పడరాని పాట్లు పడతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఉండి స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు




ప్రచారంలో స్వతంత్ర అభ్యర్థి శివరామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఎంఎల్ఎగా పదేళ్ల పాటు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని ఉండి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. జక్కరం, వేంపాడు, కోపల్లె గ్రామాల్లో శివరామరాజు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఈ ప్రచారంలో సర్పంచి గేదల జాన్, పి.సత్యనారాయణరాజు, సిరింగి బాల వేగేశ్న బాలగణపతి వర్మ, అల్లూరి అచ్యుతరామరాజు, మంతెన శ్రీరామరాజు, వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

బిసిలకు రక్షణ చట్టం తెస్తాం : మాజీ మంత్రి పితాని



పితానిని గజమాలతో సత్కరిస్తున్న బిసి సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆచంట

బిసిలకు రక్షణ చట్టం తెచ్చే బాధ్యత టిడిపి ప్రభుత్వం తీసుకుంటుందని, చేతి వృత్తిదారులకు ఆదరణ పథకం ద్వారా అన్ని రకాలుగా సాయం అందించి ఆదుకుంటామని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. వల్లూరు పంచాయతీ పరిధి పట్టపర్తివారిపాలెం దేవళ్ల గంగయ్య కొండాలమ్మ కళ్యాణ మండపంలో జయహో బిసి సమావేశం ఎంపిటిసి సభ్యులు తాళం శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పితాని సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంలో సిఎం జగన్ ప్రజల దగ్గర్నుంచి సానుభూతి పొందేందుకు హత్యాయత్నం డ్రామాలాడుతున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎస్‌సి, బిసిలపై శ్రీరంగనాథరాజు ఎక్కడలేని ప్రేమ వలకబోస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం నవరత్నాల పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తే, ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు ఆసరా పేరుతో భోజనాలు పెట్టి చీరలతో మోసం చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకే ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. తనను గెలిపిస్తే వల్లూరు గ్రామంలో రూ.కోటితో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం పితానిని బిసి నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కర్నేని గౌరునాయుడు, అధికార ప్రతినిధి అనుచంద ప్రసాద్, రాష్ట్ర దేవాంగ సాధికారక సమితి కన్వీనర్ బేకర ప్రసాద్, రుబ్బి భాస్కరరావు, గెద్దాడ సన్యాసిరావు, పార్టీ మండలాధ్యక్షులు కేతా మీరయ్య, జనసేన పార్టీ నాయకులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, చిట్టూరి శ్రీనివాస్, సత్యనారాయణ, నాగార్జున, కేతా మురళి, దేవల రమేష్, వెంకటేశ్వరరావు, రాంబాబు, ప్రసాద్, బండి ప్రసాద్ పాల్గొన్నారు.



సార్వత్రిక సంగ్రామం



ఒక వైపు గోదావరి మరో వైపు సముద్రం.. ఉప్పుటేరు మధ్య కృష్ణా, తూరుగోదావరి సరిహద్దులో ఉన్న నియోజకవర్గం నరసాపురం. పశ్చిమ డెల్టాలో ప్రధాన సబ్‌డివిజన్ కేంద్రం. లోక్‌సభ స్థానానికి శాసనసభ నియోజకవర్గానికి కేంద్రం. శతాబ్దాల చరిత్రను సొంతం చేసుకుని అనేక అంశాలను ఆభరణాలుగా సింగారించుకుంది.

భిన్న సంస్కృతుల ద్వీపం..

నరసాపురం

శతాబ్దాల చరిత్ర నరసాపురం సొంతం.. ఎంతో మంది ప్రముఖుల విద్యాభ్యాసం ఇక్కడే



నరసాపురం నియోజకవర్గం

పురుష ఓటర్లు : 83,745
మహిళా ఓటర్లు : 84,442
పోలింగ్ కేంద్రాలు :169
గ్రామాల సంఖ్య : 45




ఆర్.సత్యనారాయణ రాజు

ప్రజాశక్తి - నరసాపురం

నౌషాపూర్.. నృసింహపురం.. నరసాపురం.. బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతం స్పెయిన్, డచ్, పోర్చుగీసు పాలకులకు వ్యాపార కేంద్రమే కాకుండా మేధావులు, దేశభక్తులు, సాహితీవేత్తలు, స్వాతంత్ర సమరయోధులు, కళాకారుల నిలయం. లేసు, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు ప్రసిద్ధి. బిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి, కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం, శాస్త్రవేత్త యర్రా ప్రగడ సుబ్బారావు, సినీనటుడు కృష్ణంరాజు, అగ్రదర్శకులు దాసరి, బాపు విద్యాబుద్ధులు నేర్చుకున్నది ఇక్కడే. పద్మశ్రీ అవార్డు అందుకున్న అద్దేపల్లి సర్వేశెట్టి, వ్యవసాయ శాస్త్రవేత్త, మాజీ ఎంఎల్‌సి ఎంవి.రావు, షార్ శాస్త్రవేత్త ప్రసాద్, పద్మభూషణ్ చిరంజీవి, కళాప్రపూర్ణ పెద్దింటి దీక్షిత్‌దాసు ఈ ప్రాంతం బిడ్డలే..

నియోజకవర్గంలో నరసాపురం పట్టణం, నరసాపురం, మొగల్తూరు మండలాలు ఉన్నాయి.

తూర్పున వశిష్ట గోదావరి, దక్షిణాన బంగాళాఖాతం ఈ నియోజక వర్గానికి హద్దులుగా ఉన్నాయి. నరసాపురం నియోజకవర్గానికి ఓ వైపు భీమవరం, మరోవైపు పాలకొల్లు ఉన్నాయి. మొగల్తూరు బంగినపల్లి మామిడికి, లేసుఉత్పతులకు ప్రసిద్ధి. పట్టణంలో బ్రిటీష్ కాలంనాటి కట్టడాలు, వైఎన్ కళాశాల, లూథరన్ చర్చి, పేరుపాలెం బీచ్, ముత్యాలపల్లి బండి ముత్యాల అమ్మవారు, డచ్చి వారి పూర్వపు వ్యాపార స్థావరాలు ఇక్కడ ప్రసిద్ధి. అటు గోదావరి, ఇటు సముద్రతీరం కావడంతో న ి నీ



షూటింగులు ఇక్కడ ఎక్కువగా జరుగుతుంటాయి. ఉమ్మడి జిల్లాలో ఏకైక సముద్ర తీరప్రాంతం నరసాపురం నియోజకవర్గంలో ఉంది. ఈ తీర ప్రాంతంలో రైతులు ఉప్పు, చేపలు, రొయ్యలు, పీతలు వంటివి పండిస్తారు. మహారాష్ట్రలో పుట్టిన గోదావరిలోని పాయ వశిష్ట గోదావరి నరసాపురం నియోజకవర్గం బియ్యపుతిప్ప ప్రాంతంలో, కోనసీమ జిల్లా అంతర్వేది ప్రాంతంలో కలుస్తుంది. ఇక్కడ సముద్రం చేపలకు మంచి గిరాకీ ఉంది. ఇక్కడ నుంచి హైకోర్టు జడ్జిగా గంధి భవాని ప్రసాద్ పనిచేశారు. సినీ దర్శకుడు, చిత్రకారుడు బాపు పుట్టిన ఊరు నరసాపురం. వైఎన్ కళాశాలలో పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అధ్యాపకునిగా పనిచేసారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1962(ద్వి)	పి.శ్యామసుందరరావు	సిపిఐ	జి.వెంకన్న	కెఎంపిపి
	బి.లక్ష్మీనరసరాజు	సిపిఐ	ఎ.సత్యనారాయణరాజు	కాంగ్రెస్
1955	జి.వెంకటరెడ్డినాయుడు	కాంగ్రెస్	ఎన్.రామారావు	సిపిఐ
1962	పరకాల శేషావతారం	కాంగ్రెస్	ఆర్ఎస్ఎన్.రాజు	సిపిఐ
1967	ఆర్.సత్యనారాయణరాజు(ఆర్ఎస్)	సిపిఎం	పరకాల శేషావతారం	కాంగ్రెస్
1972	పరకాల శేషావతారం	కాంగ్రెస్	ఆర్ఎస్ఎన్.రాజు	సిపిఎం
1978	పరకాల శేషావతారం	కాం.ఐ	పి.వాసుదేవరావు	జనతా
1981(ఉ.ఎ)	పరకాల కాళీమాంబ	కాంగ్రెస్	కెఎన్.రావు	జనతా
1983	హరిరామజోగయ్య	టిడిపి	ఎం.సత్యనారాయణ	కాంగ్రెస్
1985	సిహెచ్.వెంకటహరిరామజోగయ్య	టిడిపి	ఎం.సత్యనారాయణ	కాంగ్రెస్
1989	కొత్తపల్లి సుబ్బారాయుడు	టిడిపి	పి.వాసుదేవరావు	కాంగ్రెస్
1994	కొత్తపల్లి సుబ్బారాయుడు	టిడిపి	పరకాల ప్రభాకర్	కాంగ్రెస్
1996(ఉ.ఎ)	కొత్తపల్లి జానకీరామం	టిడిపి	పరకాల ప్రభాకర్	కాంగ్రెస్
1999	కొత్తపల్లి సుబ్బారాయుడు	టిడిపి	కె.నాగతులసి	కాంగ్రెస్
2004	కొత్తపల్లి సుబ్బారాయుడు	టిడిపి	ముదునూరి ప్రసాదరాజు	కాంగ్రెస్
2009	ముదునూరి ప్రసాదరాజు	కాంగ్రెస్	కొత్తపల్లి సుబ్బారాయుడు	పిఆర్‌పి
2012 (ఉఎ)	కొత్తపల్లి సుబ్బారాయుడు	కాంగ్రెస్	ముదునూరి ప్రసాదరాజు	వైసిపి
2014	బండారు మాధవనాయుడు	టిడిపి	ముదునూరి ప్రసాదరాజు	వైసిపి
2019	ముదనూరి ప్రసాదరాజు	వైసిపి	బొమ్మిడి నాయకర్	జనసేన

2009 ఎన్నికలకు ముందు ఓటర్లు సంఖ్య ఎక్కువగానే ఉండేది. పునర్విభజనలో భాగంగా నరసాపురం నియోజకవర్గంలో కుదించారు. ప్రస్తుతం నరసాపురం మున్సిపాల్టీ, మొగల్తూరు, నరసాపురం మండలాలు ఈ ప్రాంతాల్లో ఉన్నాయి. 2009 పునర్విభజన ముందు నరసాపురం, మొగల్తూరు మండలాలతో పాటు యలమంచిలి మండలంలోని బాడవ, ఏనుగువానిలంక, కలగంపూడి, చించినాడ, కాజ తూర్పు, కాజా పడమర, ఉటాడ, యలమంచిలి, యలమంచిలి లంక, ఆర్య పేట, మేడపాడు, కొంతేరు, అడవి పాలెం, సిరగాలపల్లి గ్రామాలు ఈ నియోజకవర్గంలో ఉండేవి. భీమవరం మండలంలోని వెంప, శ్రీరాంపురం, కోమటిదిప్ప గ్రామాలు ఇందులో ఉండేవి. 1955 నుంచి ఇవన్నీ గ్రామాలు నర్సాపురం నియోజకవర్గం గ్రామాలే 2009లో నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఆయా గ్రామాలు దూరమయ్యాయి. యలమంచిలి మండలంలోని 14 గ్రామాలను పాలకొల్లులో కలిపారు. వెంప, కోమటితిప్ప, శ్రీరాంపురం గ్రామాలను భీమవరం నియోజవర్గంలో కలిపారు. పాలకొల్లు నియోజకవర్గం నుండి కొప్పర్రు, మల్లవరం, మల్లవరం లంక, కంసాల బేతపూడి గ్రామాలను నరసాపురం నియోజకవర్గంలో కలిపారు. ఈ నాలుగు గ్రామాలు నర్సాపురం మండలం అయినప్పటికీ పాలకొల్లు నియోజకవర్గంలో కొనసాగేవి. పునరుభజనకు ముందు నరసాపురం నియోజకవర్గం ఓటర్ల సంఖ్య 1,60,792 మంది. మొత్తం 1,68,187 మంది ఓటర్లు ఉన్నారు.

తొలి మహిళా ఎంఎల్ఎగా పరకాల కాళికాంబ 1981లో విజయం సాధించారు. పరకాల శేషావతారం, కాళికాంబ కుమారుడు పరకాల ప్రభాకర్ టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ సలహాదారునిగా పనిచేశారు. ఆయన భార్య నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక శాఖా మంత్రిగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు మూడుసార్లు ఇక్కడ ఉప ఎన్నికలు జరిగాయి.

ఇప్పటివరకూ మొత్తం 18 సార్లు ఎన్నికలు జరిగాయి. నరసాపురం టిడిపి కంచుకోటగా చెప్పొచ్చు. ఇప్పటివరకూ 8 సార్లు టిడిపి గెలిచింది. కాంగ్రెస్ ఏడుసార్లు, సిపిఐ, సిపిఎం, వైసిపి ఒక్కోసారి గెలిచాయి. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అత్యధికంగా ఐదుసార్లు ఎంఎల్ఎగా గెలిచారు.



వశిష్ట గోదావరి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

కాంగ్రెస్ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కావూరి లావణ్య




ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి లావణ్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు బలపర్చిన ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కావూరి లావణ్య కోరారు. కాంగ్రెస్ పోలవరం ఎంఎల్ఎ అభ్యర్థి దువ్వెల సృజనతో కలిసి జీలుగుమిల్లిలో ఆదివారం ప్రచారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రెండు సార్లు అధికారంలోకొచ్చిన బిజెపి ప్రభుత్వం రైతులను, కార్మికులను, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ఎన్‌డిఎ కూటమి పక్షాలైన టిడిపి, జనసేనలు, అధికారంలో ఉన్న వైసిపి రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఎప్పుడూ నిలదీయలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, సిపిఐ నాయకులు శ్రీనివాస్, నాయకులు కొండలరావు, అప్పారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం :ప్రచారంలో ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

కుల, మత, ప్రాంత, పార్టీ తారతమ్యం లేకుండా అర్హులందరికీ అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అందించామని చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలలోని మర్రితిప్ప గ్రామంలో 27వ రోజు ఆదివారం ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో నరసాపురం నియోజకవర్గాన్ని అన్ని అవకాశాలు ఊయోగించుకుని అభివృద్ధి చేశామన్నారు. నిస్వార్థంగా రాజకీయం చేస్తూ మళ్లీ మీ అందరి ముందుకూ వైసిపి అభ్యర్థిగా వచ్చానన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. పట్టణంలోని 19వ వార్డులో ఎంఎల్ఎ సతీమణి ముదునూరి శారదవాణి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సిఎంపై దాడికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బర్రి శ్రీవెంకటరమణ, నాని, హేమకుమార్, యర్రా శ్రీను, కేసరి గంగరాజు పాల్గొన్నారు. మండలంలోని రుస్తుంబాద పంచాయతీ మండావారిగరువు వద్ద నుంచి సోమవారం ప్రజ ఆశీర్వాద ఎన్నికల ప్రచారంలో చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు కుమారుడు శ్రీకృష్ణంరాజు పాల్గొంటారని వైసిపి మండలాధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ తెలిపారు.

బావ, బావమరుదుల ప్రచారం

మొగల్తూరు :ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పాలన చేస్తుందని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు, అల్లుడు అనిర్విన్న అడ్డూరి ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైసిపిని ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, ఏగి బాబి, కొత్తపల్లి దొరబాబు, బాబి, కోడెల్ల వెంకట్రావు, పత్తి రాంబాబు, నిప్పులేటి సుభాష్ చంద్రబోస్, లోకం రాంబాబు, మైలాబత్తుల బాబు పాల్గొన్నారు.

మండలంలోని పేరుపాలెం సౌత్‌లో వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు.

తణుకు రూరల్ :ప్రాణదాతలు, వైద్యుల సేవలు వెలకట్టలేనివని మంత్రి డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలో స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) హాలులో వైద్యులను కలిశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఇప్పుడు ఆధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేయాలని కోరారు. గత ఐదేళ్లలో అభివృద్ధి చేశామని, సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాట్ల సుందరరామరాజు, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ ఆనంద్, కార్యదర్శి డాక్టర్ వి.సుందరరావు, డాక్టర్ ఒఎస్.రమణి, డాక్టర్ శ్రీధర్, కె.సత్యనారాయణరాజు, డాక్టర్ రమేష్‌చంద్రబాబు పాల్గొన్నారు.

టిడిపి కూటమితోనే లబ్ధి

నిమ్మల రామానాయుడు సతీమణి



తణుకు : ప్రచారంలో రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలో అధికారంలోకి రానున్న టిడిపి కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని టిడిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు సతీమణి సూర్యకుమారి తెలిపారు. మండలంలోని జిన్నూరులో ఆదివారం ఆమె టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో కలిసి ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రామానాయుడును మరోసారి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వంలో అమలు జరిగే సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికి పంచారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, మేడిశెట్టి బుజ్జి, దేవరపు దొరబాబు, పెనుమత్స రాంభద్రరాజు, దాసరి రత్నరాజు, పాలవలసరావు గిరిగి గోపాలకృష్ణ, జడ్డు సూరి, దేవళ్ల ప్రసాద్, వల్లూరి ధనుంజయ్, పాల నాగలక్ష్మి, బాలం వరలక్ష్మి, వల్లూరి మాధురి, రేవతి, పార్వతి పాల్గొన్నారు.

బొమ్మిడి నాయకర్ సతీమణి ప్రచారం

నరసాపురం : పట్టణంలోని 8, 9 వార్డుల్లో జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సతీమణి సునీత ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గాజు గ్లాస్ గుర్తుపై ఓటు వేసి జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కరనాయుడు, కొల్లు పెద్దిరాజు, పోలిశెట్టి సాంబ, తోట అరుణ, తిరుమాని శశిదేవి పాల్గొన్నారు.

తణుకులో రాధాకృష్ణ సతీమణి ప్రచారం

తణుకు :టిడిపి తణుకు ఎంఎల్ఎ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణను గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి కృష్ణతులసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 24వ వార్డులో ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకి ఓటేసి రాధాకృష్ణను గెలిపించాలని కోరారు. టిడిపితోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారన్నారు. చంద్ర బాబు ప్రకటించిన భవిష్యత్తు గ్యారెంటీ పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బసవ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ కె.ఇందిరాదేవి, కొమ్మిరెడ్డి రమాదేవి, కమలాపు రమణమ్మ, కాకినాడ సత్యవాణి, తణుకు రేవతి, పితాని సత్యదేవి పాల్గొన్నారు.

ఒక్క పిలుపుతో వెంటనే స్పందిస్తా : అంజిబాబు

భీమవరం రూరల్ : మీకు ఏ సమస్య వచ్చినా వాటి పరిష్కార మార్గానికి ఒక్క పిలుపుతో వెంటనే స్పందిస్తానని, ఆ సమస్యలను పరిష్కరిస్తామని జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం వీరమ్మ పార్క్ వద్ద వాకర్స్ సభ్యులను ఆయన ఆదివారం కలిసి మాట్లాడారు. ప్రశాంతమైన భీమవారాన్ని సాధించుకుందామని, భీమవరం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు.

ముసునూరు : టిడిపి నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి నూజివీడు మండల పరిధిలోని తుక్కులూరు, జంగంగూడెం గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

దంతాల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - పెనుమంట్ర

దంతాల ఆరోగ్యమే దేహ ఆరోగ్యమని, అందరూ దంతాల పట్ల జాగ్రత్త వహించాలని భీమవరం విష్ణు దంత కళాశాల వైద్యులు అన్నారు. ఆదివారం మార్టేరు రోటరీ భవనంలో మానవతా సంస్థ పెనుమంట్ర శాఖ, విష్ణు డెంటల్ కళాశాల కలిసి నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరంలో స్థానిక వైద్యులతో కలిసి పలువురుకి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు స్థానిక జనరిక్ మందుల కేంద్రం వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి.కృష్ణమూర్తి, ఎం.మురళీ జోగి రెడ్డి, నూలి సందీప్, పులగం కృష్ణ కళ్యాణ్ రెడ్డి, మానవత జిల్లా శాఖ కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి, పెనుమంట్ర శాఖ అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు రోగులు శిబిరంలో సేవలు పొందారు.

నరసాపురం స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా సత్యభగవాన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్



సార్వత్రిక ఎన్నికల్లో తాను నరసాపురం స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రముఖ వ్యాపారవేత్త కలిదిండి వెంకటరామ సత్య భగవాన్‌రాజు ఆదివారం ప్రకటించారు. తనది భీమవరం పట్టణానికి ఆనుకుని ఉన్న దిరుసుమర్రు గ్రామమని తెలిపారు. ఇప్పటికే గ్రామాభివృద్ధికి తన కుటుంబ సభ్యులు అనేక కార్యక్రమాలు చేశారని చెప్పారు. ఈ నెల 21వ తేదీన ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. తాను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో యోగ, కరాటే ప్రథమ శ్రేణిలో రాణించడమే కాకుండా ఎంతోమంది విద్యార్థులకు నిత్యం తర్ఫీదు ఇస్తున్నానని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - ఉండి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. మండలంలోని వెలువర్రు గ్రామ దేవత వీర పేరంటాలమ్మవారి 71వ వార్షిక మహోత్సవాల సందర్భంగా రఘురామకృష్ణంరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటితే భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందించేందుకు సుగమం అవుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో గతంలో తాను నాటిన చిన్న మొక్క నేడు పెద్ద వృక్షమైందన్నారు. తాను పేరంటాలమ్మ ఆశీస్సులతో పోటీలో ఉంటానని, ఎంఎల్‌ఎగానా, ఎంపీగానా అనే విషయం రెండు రోజుల్లో తెలుస్తుందన్నారు. ఆయనతోపాటు జనసేన పిఎసి సభ్యులు వేగేశ్న కనకరాజుసూరి, టిడిపి నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, వీరవాసరం జెడ్‌పిటిసి సభ్యులు గుండా జయప్రకాష్‌నాయుడు, నాయకులు కొత్తపల్లి నాగరాజు, కల్వెపల్లి సతీష్‌రాజు, తోట శ్రీరాములు, కునుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజులు కోలనపల్లిలో పెదపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రాతళ్ల మెరక చిన్నపేట అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూత్ ఆధ్వర్యంలో కలవపూడి, ప్రాతాళ్ల మెరక జువ్వలపాలెం, ఏలూరుపాడు, కాళ్లకూరు గ్రామాల వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ యూత్ సభ్యులు సిరివెళ్ల శివకృష్ణ, డి.ఎస్.బాబు, జి.రాజేష్, ఎస్.రమేష్, ఆర్.ప్రసన్నకుమార్ ఆర్థిక సాయంతో దుస్తులు పంపిణీ చేశారు.

ఆచంట : ఆచంట వేమవరంలో వృద్ధులకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

నరసాపురం : చీఫ్ విప్ కార్యాలయంలో ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక మీరా స్మారక గ్రంథాలయం భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నేతలు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి కానూరి ఉదయభాస్కరకృష్ణప్రసాద్(బుజ్జి)ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనుమంట్ర : సోమరాజు ఇల్లింద్రపర్రు గ్రామంలో నిర్వహించిన వేడుకలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్టేరులో మానవత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రముఖ వైద్యులు మురళీజోగిరెడ్డి మాట్లాడారు. మండలంలోని పోలమూరు అంబేద్కర్ నగర్‌లోని సమత ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ట్రస్ట్ వ్యవస్థాపకుడు తాడిపత్రి సంపత్‌రావు మాట్లాడారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలకు నగదు బహుమతి ప్రదానం చేశారు. పెనుమంట్రలో కౌలు రైతు సంఘం, సిఐటియు మండల శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల శాఖ కార్యదర్శి కోడి శ్రీనివాసప్రసాద్, సివిల్ సప్లయ్ గోదాం మేస్త్రి గంటి ఆంజనేయులు, రైస్ మిల్స్ జట్టు మేస్త్రి మాదాసు లక్ష్మణరావు పాల్గొన్నారు.

గణపవరం : గణపవరం, సరిపల్లి, జల్లి కాకినాడ, వాకపల్లి, కేశవరం పలు గ్రామాల్లో జయంతి వేడుకలు నిర్వహించారు. టిడిపి గణపవరం కమిటీ ఆధ్వర్యంలో కుమారి థియేటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పార్టీ అధ్యక్షులు కోసంపూడి సురేంద్రకుమార్‌రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్ధవరంలో కుల వివక్షత వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచి గాతల సుజాత అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపిపి దండు వెంకటరామరాజు మాట్లాడారు. అనంతరం గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

తాడేపల్లిగూడెం రూరల్ : వెంకటరామన్నగూడెంలో వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనంలో ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం చేశారు.

ఆచంట : ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, అయోధ్యలంక గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పూలు మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెనుమంచిలిలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఆకివీడు : సిపిఎం కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలదండ వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ అధ్యక్షులు పండు అనిల్‌కుమార్ స్థానిక పెద్దపేటలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వైసిపి ఉండి ఎంఎల్‌ఎ అభ్యర్థి పివిఎల్.నరసింహరాజు, స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి శివరామరాజు నివాళులర్పించారు.

పాలకొల్లు : పాలకొల్లు టాటా ఏసి ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వైసిపి పాలకొల్లు ఎంఎల్‌ఎ అభ్యర్థి గుడాల గోపీ పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయం గాంధీ భవనంలో అంబేద్కర్ చిత్రపటానికి, గాంధీ బొమ్మల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు యడ్ల శివాజీ, పాలకొల్లు ఎంఎల్‌ఎ అభ్యర్థి కొలుకులూరి అర్జున్‌రావు పూలమాలలు వేశారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి ఎన్నికల శిబిరంలో అంబేద్కర్ చిత్రపటానికి జనసేన ఎంఎల్‌ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక 11వ వార్డులోని గరుగుపేట చర్చి వద్ద మీసాలరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పోడూరు : మండలంలోని చంద్రరాజు చెరువు, గంగన్న చెరువు, కొత్తపేట, పూజారి గరువు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో సిపిఎం నేతలు పాల్గొని నివాళులర్పించారు.

పాలకొల్లు రూరల్ : బద్దావానిపేటలో అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుండె నగేష్ బాబు, జిల్లా కార్యదర్శి నల్లి జయరాజు, డివిజన్ ఉపాధ్యక్షులు బద్ద అంతర్వేది పాల్గొన్నారు.

ఉండి : కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపీ ఆధ్వర్యంలో పాందువ్వలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ గ్రామ సభ్యులు పి.సుబ్రహ్మణ్యం, జి.హరీష్, ఎం.రామయ్య, ఎస్.రాంబాబు, ఎం.శివకృష్ణ, జి.పోతురాజు, నారాయణదాసు, ఎం.సతీష్, ఎస్.రాంబాబు, ఎస్.శ్రీను, జి.రాంబాబు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ఎన్‌టిఆర్ పార్క్ వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు కామన మునిస్వామి, గుబ్బల గోపీ, శ్రీను, రాము పాల్గొన్నారు.

తణుకు : స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బసవ రామకృష్ణ, కడియాల సూర్యనారాయణ, గోపిశెట్టి చిన్నారావు, మారుతీరావు పాల్గొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పాలకోడేరు : మోగల్లులో నిర్వహించిన వేడుకల్లో పాలకోడేరు ఎస్ఐ నాలం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నేతల శ్యామ్‌కుమార్, దుండి సంజీవ్, జాలే సునీత, చిల్లా రత్నరాజు, మైలాబత్తుల వెంకట్రావు, గోడిభూషణం, కేదాసి చిట్టిబాబు, డేవిడ్, మల్లా సుబ్బారావు, గుండుగొల్లు కిరణ్, గోడి రవి పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని కొత్తపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, వైసిపి నరసాపురం ఎంఎల్‌ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు, అల్లుడు డాక్టర్ అనిర్విన్స్, మైలాబత్తుల రాంబాబు, జయబాబు, కోడెల్ల వెంకటరావు పాల్గొన్నారు గాంధీ బొమ్మ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఐ కె.వెంకటరమణ, సర్పంచి పడవల మేరి సత్యనారాయణ, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, దళిత సంఘ నాయకులు, టిడిపి నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పోడూరు : గుమ్మలూరు శివారు రావిగొప్పులో అంబేద్కర్ విగ్రహాన్ని ఎస్‌సి కమిషన్ మెంబర్ ఆనందప్రకాష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గొట్టుముక్కల సోనియా రమేష్, మాజీ సర్పంచి కుక్కల దుర్గారావు, గంగోలు శ్రీను, ఈతకోట భాస్కరరావు, ఆకుమర్తి ప్రసాద్, దిద్దే శ్రీనివాస్, వడ్లపాటి సురేష్ పాల్గొన్నారు.

మొగల్తూరులో రక్తదాన శిబిరం

మొగల్తూరు : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మొగల్తూరులో రామకృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మొగల్తూరులోని రామాలయం వీధిలో ఉన్న టిఆర్‌కెఆర్ బజార్ ఆవరణలో జై భీమ్ రక్తదానం నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన ఆపద్బాంధవ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రక్తం సేకరించారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామం అరుంధతిపేటకు చెందిన తెన్నేటి వైశాలి, దిగుమర్తి కృపాసాగర్ ఇటీవల విడుదలైన ఇంటర్ మొదటి సంవత్సరంలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. వారికి స్థానిక స్టాలిన్ రెస్టారెంట్ యజమాని తెన్నేటి స్టాలిన్ ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.రెండు వేలు అందించారు.

బిల్లుల బాదుడు..!

(మొదటి పేజీ నుంచి)

వడ్డనపై సైతం జనాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే పెట్రోల్, గ్యాస్, పప్పులు, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వేతనాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయాయి. దీంతో సామాన్య ప్రజానీకం బతుకులు దుర్భరంగా మారాయి. అధికారంలోకి రాకముందు ఒకలా.. వచ్చిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్న రాజకీయ పార్టీలపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంబేద్కర్ గొప్ప దార్శనికుడు

(మొదటి పేజీ నుంచి)

చదవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో 18 సంవత్సరాలు దాటి ఓటు హక్కు కలిగిన వారు ఓటు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, సాంఘిక సంక్షేమ శాఖ జెడి జయ ప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

మహనీయులు అంబేద్కర్ : కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం : సమాజంలో కుల వివక్ష, ఆర్థిక అసమానతలు సమూలంగా రూపుమాపేందుకు విద్య ఒక్కటే మార్గమని తెలియజెప్పిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్, జెసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో అందరూ సమానమే అని, తక్కువ, ఎక్కువ అని కాకుండా అందరికీ అన్ని హక్కులూ కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సి.వి.ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ అంబేద్కర్ చిన్నప్పుడు వివక్షను ఎదుర్కొన్నారని, దాని నుంచి బయటపడేందుకు విద్య అనేది ఒకటే మార్గమని భావించి ఉన్నత విద్యను అభ్యసించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారి పి.పాపారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి జూన్ 15 వరకూ

సముద్రంలో వేట నిషేధం

(మొదటి పేజీ నుంచి)

తెలిపారు. జిల్లాలో మొగల్తూరు, నరసాపురం మండలాల్లో సముద్ర తీరం వెంబడి పేరుపాలెం, కెపి పాలెం, మొల్లపర్రు, పెదమైనవాని లంక, చినమైన వాని లంక, వేములదీవి గ్రామాల్లో సముద్ర వేటకు వెళ్లేవారు ఉన్నారు. జిల్లాలో మొత్తం 9,277 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరిలో సముద్ర వేటకు వెళ్లేవారు మత్స్యకారులకు గత ఏడాది 1635 మందికి భృతి అందించారని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. మొత్తం జిల్లాలో 457 బోట్లు ఉన్నాయి. వాటిలో 145 మోటరైజేడ్, 312 నాన్ మోటరిజెడ్ బోట్లు ఉన్నాయి. సముద్రంలో వేటాడేవారు 1806 మోటరైజ్డ్ బోటుకు ఆరుగురు చొప్పున మత్స్యకారులకు రూ.60 వేలు అందిస్తారు. నాన్ మోటరైజెడ్ బోట్లకు బోటుకు ముగ్గురు చొప్పున రూ.30 వేలు అందిస్తారు. అయితే పెరిగిన ధరల దృష్ట్యా భృతి సరిపోవడం లేదని భృతి పెంచాలని గంగపుత్రులు అంటున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.వి.రమణారావు తెలిపారు. కావున సదరు సమావేశానికి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

వైసిపిలోకి పలువురు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలోని 15, 26, 18వ వార్డులకు సంబంధించిన టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైసిపిలో చేరారు. 15వ వార్డు నుంచి పార్టీలో చేరిన వారిలో గాడి రవి, విద్యాసాగర్, కోలా వెంకటరమణ, మామిడి ప్రసాద్, ఆర్.ఉదయ భాస్కర్, కొరనాని ధనరాజ్, కిట్టా కిట్టి రాజేష్, బోగాడి సురేష్, నల్లిగిరి సత్యనారాయణ, 26వ వార్డు నుంచి సుంకర ప్రసాద్ ప్రిన్స్, సుంకర రాంబాబు, సుంకర శ్రీరామమూర్తి, సుంకర బాబి, వెంకటేశ్వరరావు, మహేష్, తరుణ్‌లతో పాటుగా మరో 50 మంది పార్టీలో చేరారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కళకళ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారు ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

సతీష్‌కు అభినందన

ప్రజాశక్తి - నరసాపురం

బిజెపి నరసాపురం నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన మేకల సతీష్‌ని నర్సాపురం స్టీమర్ రోడ్‌లోని వారి నివాసంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమ గోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్యలక్ష్మి సతీష్ సేవలను కొనియాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను సతీష్ అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా కమిటీ కార్యదర్శి వలవల తాయారు, చల్లా పద్మావతి, వనితా క్లబ్ కార్యదర్శి బండి స్వర్ణలత, కోశాధికారి రంగినీడి భరణి, సహాయ కార్యదర్శి తోట భారతి, తోట అరుణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండి

కొలమూరులోని 11 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మత్తుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సబ్ స్టేషన్ పరిధిలోని పులిగుమ్మ ప్రాంత ప్రజలకు, ఆక్వా రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ అంతరానికి పులిగుమ్మ ప్రాంత ప్రజలు, ఆక్వా రైతులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

ఇంటర్‌లో శశి విద్యార్థుల ప్రభంజనం

పాలకొల్లు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పాలకొల్లు శశి జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యా సంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 99 శాతం ఉత్తీర్ణులు అయ్యారని, వీరిలో అత్యధికంగా ఎంపిసి విభాగంలో 987 మార్కులతో డి.శివమణి పట్టణంలో మూడో స్థానంలో, బైపిసి విభాగంలో ఎమ్.రమ్యదీపిక(982) మార్కులతో పట్టణంలో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 97 శాతం ఉత్తీర్ణులు అయినారని, వీరిలో అత్యధికంగా ఎంపిసి విభాగంలో 464 మార్కులతో ఎమ్.జోత్స్న టౌన్ రెండోస్థానం, బైపిసి విభాగంలో సిహెచ్.సంజని 432 మార్కులతో టౌన్ మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులను, వారికి సహకరించిన తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకాడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, క్యాంపస్



విద్యార్థులను అభినందిస్తున్న వేణుగోపాలకృష్ణ

ఇన్‌ఛార్జి బి.కిషోర్ కుమార్, ప్రిన్సిపల్ సిహెచ్.రామ్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ ఒ.శ్రీనివాస రావు, హెడ్ మాస్టర్ బి.బాలాజీ అభినందించారు.

ఇంటర్ విద్యార్థినుల ప్రతిభకు అభినందన



విద్యార్థులను సత్కరిస్తున్న పాలకమండలి సభ్యులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆంధ్ర అసోసియేషన్(యుకె) జూనియర్ కళాశాల నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభతో మంచి మార్కులు సాధించిన విద్యార్థినులను కళాశాల పాలకవర్గం అభినందనలు తెలియజేసి సత్కారించింది. ఆదివారం పెనుమంట్ర ఆంధ్ర అసోసియేషన్ జూనియర్ కళాశాల పాలక మండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో ద్వితీయ సంవత్సర ఎంపిసిలో మండలం ప్రథమస్థానం సాధించిన సత్తి తరుణీ సాయి సంతోషిణి(976), పి.నాగ శ్రీవల్లి(974), ఇంటర్ ఎంపిసి ప్రథమ ఫలితాలలో వరుసగా వివిఎస్ఎన్ ఎల్.కామాక్షి(461), జి.హరిత(457), వి.మౌనిక శ్రీలక్ష్మి(451), సిఇసిలో బి.లక్ష్మీశ్రేష్ట(458)లను ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎం.విజయ సింహారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారంపూడి సుబ్బారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు తేతలి గుర్రెడ్డి, కార్యదర్శి అండ్ కరెస్పాండెంట్ తమనంపూడి రామారెడ్డి, కోశాధికారి సత్తి సత్యానంద రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎ.సత్య ప్రకాష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత చిత్రలేఖన శిక్షణ తరగతులు

పాలకొల్లు : పాలకొల్లు ది ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సారథ్యంలో గతనెల 24 నుంచి జూన్ 9వ తేదీ వరకు 11 వారాలు ఉచిత చిత్రలేఖన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ చిత్రకారులు వాకలపూడి అప్పారావు జ్ఞాపకార్థం సంఘం, ఐషా పరివార్ క్లబ్ - పాలకొల్లు లెజెండ్స్ వారు సంయుక్తంగా శిబిరం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి 100 మందికి పైగా విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. సంఘ సభ్యులు, కార్యవర్గ సభ్యులు సహకారంతో డ్రాయింగ్ టీచర్లుగా నీల్ కమల్ ఆర్ట్స్ మూర్తి, ఎస్‌కెడి.రవి, కడలి శ్రీను, చెల్లబోయిన రాము, జివిఎస్ఎన్, గౌరవా అధ్యక్షులు వల్లూరి రామబ్రహ్మం, అధ్యక్షులు నీలం రవి, కార్యదర్శి సమతం చంద్రరావు, కోశాధికారి బొప్పే సాంబమూర్తి, హైషా పరివార్ క్లబ్-పాలకొల్లు లెజెండ్స్ అధ్యక్షులు బొప్పే దుర్గాప్రసాద్ షణ్ముఖరావు, కార్యదర్శి సమతం వీరభద్రరావు, కోశాధికారి అందే కోట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపిలోకి పలువురు

పెనుమంట్ర: మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన రజకులు 12 మంది ఆచంట అసెంబ్లీ టిడిపి అభ్యర్థి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం టిడిపిలో చేరారు. గడిచిన ఐదేళ్ల పాలనలో బిసి కులాలకు అసలు అభివృద్ధి జరగలేదన్నారు. పార్టీలో చేరిన వారిలో బవిరి వెంకటేశ్వరరావు, తలుపూరి ఆదినారాయణ, జొన్నాడ వెంకటేశ్వరరావు, జొన్నాడ సత్యనారాయణ, జొన్నాడ ఏడుకొండలు, సాపాటి మూర్తి తదితరులున్నారు.

'జగన్‌పై దాడి హేయమైన చర్య'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

విజయవాడలో జరిగిన బస్సు యాత్రలో సిఎం జగన్మోహన్ రెడ్డిపై రాళ్ల విసరడాన్ని జంగారెడ్డిగూడెం పట్టణంలోని వైసిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. జగన్మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక మూకుమ్మడిగా నాలుగైదు పార్టీలు జతకట్టి ఆకతాయిలతో రాళ్ల విసరడం చాలా హీనమైన చర్యగా నాయకులు వారు తప్పు పట్టారు. జగన్మోహన్ రెడ్డికున్న ప్రజాదారణ చూసి ఓర్వలేక తప్పుడు మార్గంలో అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు ఆడిస్తున్న ఈ కుళ్లు రాజకీయం అన్నారు. జగన్మోహన్ రెడ్డి మీద రాళ్లు విసిరినా, బుల్లెట్ విసిరినా కడిగిన ముత్యం లాగా బయటకు వస్తాడని, ఇలాంటి చర్యలు మానుకోవాలని వైసిపి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, గురునాథరావు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వీరాంజనేయులు, మండవలు విజయ సారధి, మేడవరపు విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఆకివీడు: ప్రజాస్వామ్య జీవితంలో ఏమీ చేయలేక అసమర్థతతో దాడులు చేయించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని, చంద్రబాబు నాయుడు చేయించే ఆ రకమైన దాడులు అంగీకరించే ప్రసక్తి లేదని ఉండి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు హెచ్చరించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక గౌడ శెట్టిబలిజ సంఘ కళ్యాణ మండపంలో సంఘ సభ్యులతో వైసిపి లోక్‌సభ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎంఎల్ఎ అభ్యర్థి పివిఎల్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాయకులు జగన్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భీమవరం అసెంబ్లీ వైసిపి ఇన్‌ఛార్జి మోటుపల్లి గంగాధరరావు, సంఘ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య అని వైసిపి ఆచంట అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సిఎం జగన్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. పచ్చమూకలే దాడికి పాల్పడ్డాయని ఆరోపించారు. సిఎం జగన్‌కు రోడ్‌షోలో వచ్చిన ఆదరణ చూసి ఓటమి తప్పదని దాడికి పాల్పడ్డారన్నారు. చంద్రబాబుకు అడ్డువచ్చిన వారిపై దాడులు చేయించడం అలవాటుగా మారిందన్నారు. దాడి చేసిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

భీమవరం రూరల్: ప్రజలకు మేలు చేసే



కామవరపుకోట: నిరసన తెలుపుతున్న సుందర్‌పాల్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై దాడికి పాల్పడటం అత్యంత దారుణమైన, హేయమైన చర్య అని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 15, 26, 18 వార్డులలో టిడిపి, జనసేనకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీగా ఎంఎల్ఎ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని కూడా ఒక పక్క అమలు చేస్తూనే మరోపక్క ఎన్నికలలో ఇవ్వని హామీలను కూడా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారని అన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమాన్ని, అభివృద్ధిని అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రతిపక్షాలు ఎదుర్కొనలేక ఇటువంటి దాడులకు పాల్పడడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాచు పాపయ్య, శ్రీవల్లి, ముద్దుల కరుణ్ కుమార్, వీరా హరి, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, కోడె యుగంధర్, సాలా శ్రీనివాస్, సాలా అశోక్, నాచుమని, ఎర్రంశెట్టి కొండ, వర్గీస్, కోయ సూర్యనారాయణ, నల్లం రాంబాబు, సీసలి రాజేశ్వరి, ఎలిజిబెత్, నందమూరి సుధాకర్ పాల్గొన్నారు.

నరసాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని మర్రితిప్ప గ్రామంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్సుయాత్రకు రోజురోజుకూ పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఓటమి భయంతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారన్నారు. కేంద్రం తగిన చర్యలు చేపట్టి సిఎం జగన్‌కి భద్రత పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గుబ్బల రాధాకృష్ణ, బొక్క రాధాకృష్ణ, దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజల్లో వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక భౌతిక దాడులకు పాల్పడుతున్నారని వైసిపి పశ్చిమగోదావరి జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ చదలవాడ మెర్లీన్ అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ విజయవాడలో నాలుగున్నర గంటలపాటు జరిగిన రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టరాని, దీనిని చూసి ఓర్వలేక ఇటువంటి దాడులు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిపై దాడికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

కామవరపుకోట: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై జరిగిన దాడి చాలా దుర్మార్గమని వైసిపి ఏలూరు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దాసి సుందర్ పాల్ అన్నారు. ముఖ్యమంత్రిపై జరిగిన దాడికి నిరసనగా వీరిశెట్టిగూడెంలోని సుందర్ పాల్ ఇంటి వద్ద నల్ల రిబ్బన్‌లు ధరించి కొవ్వుతులతో తమ నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరిశెట్టిగూడెం మత్స్యకార సొసైటీ ఛైర్మెన్ పెనుమాల సంజీవ రావు, ఉప్పే జయరాజు, చిన్నారి, నాగరాజు, మోషే పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ప్రతిపక్షాలు ఆయనపై దాడి చేశారని వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా కెఎస్ రామవరం, కొమ్ముగూడెం గ్రామంలో జరిగిన జయంతి వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నల్ల రిబ్బన్‌లు ధరించి ముఖ్యమంత్రిపై జరిగిన దాడికి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కడిమి రమేష్, ఎంపిపి మేడవరపు విజయలక్ష్మి, ఎఎమ్‌సి మాజీ ఛైర్మన్ మేడవరపు అశోక్ బాబు పాల్గొన్నారు.

కుక్కునూరు : జగన్మోహన్ రెడ్డిపై దుండగులు దాడి చేసి గాయపరచడాన్ని నిరసిస్తూ పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఆదివారం మండలంలోని కివ్వాక గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారాజు నాయకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : జగన్మోహన్ రెడ్డిపై రాయితో దాడి చేయడం హేయమైన చర్య అని వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు వాసిరెడ్డి మధు విమర్శించారు. జగన్‌పై దాడిని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో ఆదివారం మండల నాయకులు దేవరపల్లి ముత్తయ్య ఇంటివద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఎస్‌పిపికెహెచ్ శ్రీనురాజు, పిన్నమనేని చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రపంచానికే మార్గదర్శకుడు అంబేద్కర్

జయంతి వేడుకలో ఎస్‌పి మేరీ ప్రశాంతి


నివాళులర్పిస్తున్న ఎస్‌పి మేరీప్రశాంతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రపంచ మేధావి భారతదేశ రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచానికే మార్గదర్శకుడని ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి మేరీ ప్రశాంతి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ సంఘసంస్కర్తతో పాటు గొప్ప న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, కుల వివక్షను తరిమికొట్టేందుకు పోరాటం చేసిన పోరాట యోధుడని కొనియాడారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి పొంది ప్రపంచంలోనే అత్యధిక డిగ్రీలు కలిగిన వ్యక్తిగా ఆయన ప్రపంచవ్యాప్తంగా పేరు పొందారన్నారు. దేశంలో ఉన్న అంటరానితనాన్ని పోగొట్టేందుకు ఆయన ఎన్నో రకాలుగా ప్రయత్నించారన్నారు. ఓటు హక్కు వినియోగించుకుని మనల్ని పరిపాలించే నాయకులను మనమే ఎన్నుకునే విధానాన్ని కూడా ఆయనే దేశానికి పరిచయం చేశారన్నారు. ప్రస్తుతం నడుస్తున్న చట్టవ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ మొత్తం అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో నుంచి నడిచేవన్నారు. అంబేద్కర్ దేశానికే నాయకుడని ఆమె కొనియడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి స్వరూపరాణి, ఎఆర్‌డి ఎస్‌పి శ్రీహరి, ఇన్‌స్పెక్టర్లు సుబ్బారావు, కాగితపు శ్రీనివాసరావు, ఆర్‌ఐ పవన్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


ప్రపంచ మేధావి అంబేద్కర్
యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

భీమవరం : ప్రపంచ మేధావి అంబేద్కర్ అని, ఆయన రాసిన రాజ్యాంగం భారతదేశ దశ దిశలను మార్చేసిందని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. భీమవరంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ 133వ జయంతి వేడుకల్లో యుటిఎఫ్ నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గోపీమూర్తి మాట్లాడారు. లౌకికవాదం, మతసామరస్యం కాపాడబడటానికి రాజ్యాంగం కారణమన్నారు. ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని రాజ్యాంగంలో పేర్కొనడం వల్ల బలహీన వర్గాల వారికి ప్రభుత్వ విద్య అందిందన్నారు. ప్రస్తుతం రాజ్యాంగం సంక్షోభంలో ఉందన్నారు. పాలకులు కార్పొరేట్ విద్యకు కొమ్ముకాసి రాజ్యాంగం కల్పించిన ఉచిత నిర్బంధ విద్య లక్ష్యాన్ని నీరు గార్చారన్నారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి గునుపూడి వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు


నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నేతలు

జి.రామకృష్ణరాజు, సిహెచ్.కుమారబాబ్జి, ప్రసాద్, కెఎస్.రామకృష్ణప్రసాద్, కె.త్రిమూర్తులు, బిఆర్‌కె.స్వామి, జి.అబ్రహం, బి.నాగబాబు, శంకర్, కట్టా మల్లేశ్వరరావు, శ్రీనివాస్, మల్లుల శ్రీనివాస్, కె.అశోక్, అమీర్, పాషా, సురేష్, సత్యనారాయణ, సురేష్‌వర్మ, మోహన్, సత్యనారాయణరాజు, సూర్యకుమార్, నరసమయ్య, పి.గోపాలరాజు, వీరబాబు, పిల్లి శ్రీనివాస్, ఎం.శివరామరాజు, తిలక్, లోకేష్ పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో..



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

నాడు బడుగు, బలహీన వర్గాలకు అంబేద్కర్ రాజ్యాంగంలో హక్కులు కల్పిస్తే నేడు మోడీ హక్కులను హరిస్తున్నాడని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అన్నారు. భీమవరం పాత బస్టాండ్ సెంటర్ సమీపన ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు మాట్లాడరు. నాటి సనాతన ధర్మం బడుగు, బలహీన వర్గాలకు స్వేచ్ఛ లేకుండా చేసిందని, మనుధర్మ శాస్త్రాన్ని అంబేద్కర్ తగులబెడితే నేడు మోడీ నాటి సనాతన ధర్మాన్ని తీసుకొస్తానని చెప్పడం అంబేద్కర్ కన్నా కలలను నాశనం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.మునియ్య, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - కలిదిండి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను, బిజెపికి అనుకూలంగా ఉన్న వైసిపిని ఓడించాలన్నారు. కాంగ్రెస్ కైకలూరు ఎంఎల్‌ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ విజయానికి కృషి చేస్తామన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తన గెలుపునకు సహకరించాలని బొడ్డు నోబుల్ కోరారు. ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. సిపిఎం నాయకులు ముంగం సురేష్, అద్దాని వెంకటేశ్వరరావు, వీరవల్లి భాస్కరరావు, పరసా రాజేష్, జక్కుల మహేష్, పెరుమాళ్ల రమేష్, కె.లాజరు, వాసంశెట్టి ఏడుకొండలు, పి.సత్యనారాయణ, జి.అనిల్, కాంగ్రెస్ నాయకులు ఈదా పద్మారావు పాల్గొన్నారు.


కుట్టు శిక్షణా కేంద్రంలో మహిళలు

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

మహిళలు ఇళ్ల వద్ద ఉంటూ ఏదో ఒక శిక్షణ పొందడం ఎంతో ఉపయోగకరమని పలువురు వక్తలు అన్నారు. స్థానిక సుందరయ్య కాలనీలో ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం హేలాపురి బాలోత్సవం ఆధ్వర్యంలో ఆదివారం కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభించారు. ఏలూరు రోటరీ క్లబ్ వారు అందించిన నాలుగు కుట్టు మిషన్లతో శిక్షణా కేంద్రాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు పూర్వ అధ్యక్షులు ఎన్.జగదీష్, అధ్యక్షులు నేలపాటి రోహిత్ ప్రారంభించారు. కార్మిక నాయకులు బి.జగన్నాధరావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు సుందరయ్య కాలనీ కమిటీ నాయకులు వి.సాయిబాబా అధ్యక్షత వహించారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు అధ్యక్షులు నేలపాటి రోహిత్, పూర్వ అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి భోగరాజుప్రసాద్ మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం పది గంటల నుంచి 12:30 గంటల వరకు కుట్టు శిక్షణ కేంద్రం పని చేస్తుందని చెప్పారు. సుందరయ్య కాలనీ పరిసర ప్రాంత మహిళలు ఈ శిక్షణా కేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. బాలికలు కోలాటం ప్రదర్శించి రోటరీ క్లబ్ పెద్దలను కుట్టు శిక్షణ కేంద్రానికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వి.అరుణ, ఎ.వరలక్ష్మి, ఎం.హారిక, బి.సుశీల, జి.దేవి రాజేశ్వరి పాల్గొన్నారు.

జిల్లా మాజీ సైనికుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా మాజీ సైనికుల సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. వందేమాతరంతో ప్రారంభమైన ఈ సమావేశంలో ఏలూరు జిల్లా మాజీ సైనికుల సంఘం అమరవీరులు, ఆజాద్ హింద్ ఫౌజ్‌లోని మొయిరంగ్ వీర్ జవాన్లు, జలియన్‌వాలాబాగ్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సంఘం యోధులు దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా కె.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.బింబర రమేశ్, కోశాధికారిగా పి.భాస్కర్, గౌరవాధ్యక్షులుగా జి.వాసుకిశర్మ, ఉపాధ్యక్షులుగా జి.శ్యామ్‌గణేష్‌బాబు, పి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్ఎన్‌వి.సుబ్రహ్మణ్యం, జెవిఆర్.ప్రసాద్ పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

కట్టుదిట్టంగా ఇవిఎంల తరలింపు

పరిశీలించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఇవిఎం గోదాములో నిర్వహిస్తున్న ఇవిఎంల కేటాయింపు ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్నవెంకటేష్ ఆదివారం పరిశీలించారు. మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గత శుక్రవారం నిర్వహించి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పూర్తి చేశారు. దీనికి అనుగుణంగా శనివారం ఉదయం నుంచి స్థానిక ఇవిఎం గోడౌన్ వద్ద బియులు, సియులు, వివిప్యాట్‌లను వరుసగా 120, 120, 130 దామాషాగా విభజించారు. ఏడు నియోజకవర్గాలకు కలిపి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం బియులు 4,184, సియులు 4,184, వివిప్యాట్లు 4,534 తరలిస్తున్నారు. వీటిని జిపిఎస్ అమర్చిన డిజిటి క్లోజ్డ్ వాహనాల్లో పోలీస్ ఎస్కార్ట్‌తో పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచేందుకు అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తరలిస్తున్నారు. వీటిని వేర్వేరు స్ట్రాంగ్ రూముల్లో స్థానిక రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంలు కమిషనింగ్ వరకు భద్రపరిచి సీలు వేస్తారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆదివారం కూడా జరిగిన ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇప్పటివరకు చింతలపూడి, పోలవరం, నూజివీడు, ఏలూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాలకు సంబంధించి ప్రక్రియ పూర్తయింది. నామినేషన్ల స్క్రూట్ని అనంతరం కమిషనింగ్ (ఇవిఎంలలో బ్యాలెట్ పేపర్ ఫిక్స్) చేస్తారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేసి మళ్లీ భద్రపరుస్తారు. చివరిగా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి పోలింగ్ స్టేషన్ల వారీగా తరలిస్తారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టరు బి.లావణ్యవేణి, జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, ఇవిఎం నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఎఒ కె.కాశీ విశ్వేశ్వరరావు ఉన్నారు.

స్ట్రాంగ్ రూంలో బియులు, సియులు, వివిప్యాడ్లు భద్రం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఉంగుటూరు నియోజకవర్గానికి ర్యాండమైజేషన్ అనంతరం కేటాయించి బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాడ్లు, సికులు శనివారం రాత్రి నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల స్ట్రాంగ్ రూంకి చేరాయి. వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల నిబంధనలు అనుసరించి సీలు వేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలీ తెలిపారు. 214 పోలింగు కేంద్రాలున్నాయని, అసెంబ్లీ, పార్లమెంట్లకు వేర్వేరుగా మొత్తం 460 ఇవిఎంలు కేటాయించారు. వాటిలో సగం శనివారం రాత్రికి చేరాయని మిగతా సోమవారం నాటికి వస్తాయని తెలిపారు.



అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. నరసాపురం అగ్నిమాపక కేంద్రం వద్ద ఈ వారోత్సవాలను పశ్చిమగోదావరి జిల్లా అగ్నిమాపక అధికారి బి.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాంప్లెట్స్‌ను, బ్యానర్‌ను ఆవిష్కరించారు. నరసాపురం కేంద్రం అధికారి కె.భాస్కరరామ్ మాట్లాడుతూ ఈ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వివిధ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'హోమ్ ఓటింగ్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మే 13వ తేదీన జరగనున్న సాధారణ ఎన్నికలు పురస్కరించుకుని 85 సంవత్సరాల పైబడి తీవ్ర అనారోగ్యానికి గురై కదలలేని పరిస్థితుల్లో ఉన్న ఓటర్లకు, 40 శాతం పైబడి శారీరక వైకల్యం ఉన్నట్లుగా ధ్రువపత్రం కలిగి కదలేన్లి పరిస్థితుల్లో ఉన్న పిడబ్ల్యూడి ఓటర్లకు ఇంటివద్దనే ఓటు వేసే అవకాశం హోమ్ ఓటింగ్‌ను భారత ఎన్నికల సంఘం కల్పించిందని ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఖాజావలీ తెలిపారు. ఓటర్ల వివరాలను 15 నుంచి 17 తేదీ వరకు సేకరించేందుకు బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో గల హోమ్ ఓటింగ్‌నకు అర్హత గలిగిన ఓటర్లను గుర్తించేందుకు స్వయంగా వారి గృహాల వద్దకు వెళ్లి పరిశీలిస్తారన్నారు. వారి వివరాలను సెక్టార్ అధికారులు 18వ తేదీ నుంచి 20 వరకు మళ్లీ తనిఖీ చేసి నిబంధనల మేరకు హోమ్ ఓటర్ జాబితా తయారు చేస్తారన్నారు. అట్టి జాబితాలో ఉన్నవారికి నిర్ణీత తేదీల్లో ప్రత్యేక బృందం ద్వారా హోమ్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు.

ఏలూరు : ఏలూరు నియోజకవర్గంలో తీవ్ర అనారోగ్యానికి గురై కదల్లేని పరిస్థితుల్లో ఉన్న ఓటర్లకు 40 శాతం పైబడి శారీరక వైకల్యం ఉన్నట్లుగా ధ్రువపత్రం కలిగి కదల్లేని పరిస్థితుల్లో ఉన్న పిడబ్ల్యూడి ఓటర్లకు ఇంటివద్దనే ఓటు వేసే అవకాశం హోమ్ ఓటింగ్‌ను భారత ఎన్నికల సంఘం కల్పించిందని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, పోలవరం, ఇరిగేషన్ ప్రాజెక్ట్, యూనిట్-2, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, (భూసేకరణ) ఎం.ముక్కంటి తెలిపారు. 15 నుంచి 17 తేదీ వరకు సేకరించేందుకు బూత్ స్థాయి అధికారులు వారి పరిధిలో గల హోమ్ ఓటింగ్‌నకు అర్హత గలిగిన ఓటర్లను గుర్తించేందుకు స్వయంగా వారి గృహాల వద్దకు వెళ్లి పరిశీలిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చెప్పారు.